

# కవిగాడి కధ

బాక్సాఫీసు హిట్ కాబోయి మూడోరోజునే మానేసిన సినిమాలా, ఛాన్సు వస్తోందని గబుక్కుని ఉత్సాహ పడబోయి గారంటీలేదని జ్ఞాపకం రాగానే ఉసూరుమన్నాడు రాజు. అని వెనక్కి మళ్ళా స్టుడియోవేపు మెల్లిగా నడకసాగించాడు. కడుపులో కామేశ్వరరావు హల్లో అంటున్నాడు. జేబులో ధనపతిరావు 'నిల్లో' అంటున్నాడు. ఇందాకటి కారువాడికి ఉన్న దంతా ఊడ్చి ఇచ్చేశాడు. ఇపుడు శోష వచ్చేలా ఉంది. గబుక్కుని సినిమాఛాన్సు వచ్చేస్తే యాక్టుచెయ్యడానికి కూడా ఓపిక ఉన్నట్టులేదు.

గుక్కెడు కాఫీపోస్తే అల్లరిచేయను అని ఆశపెడుతున్నాడు కామేశ్వరరావు.

"వాడి మాటకేంలే. ముందర కాఫీ పంపు. ఆనక ఆలోచిస్తాం పనిలోకి వచ్చేదీ రానిదీ" అంటున్నాయి కాళ్ళూ చేతులూ.

రాజు కాస్త తటపటాయించి, తెగించి, 'సార్' అనేశాడు ఎదురుగా వస్తున్న ఒక సుబ్బారావుని ఆపి.

'సార్ మాది మొవ్వారం .... సినిమాలో చేరాలి. ఇఫ్ యు డోంట్ కేర్. గివ్ మీ — కాఫీ తాగాలండి. ఓ బేడ కావాలి. మళ్ళీ ఇచ్చేస్తాను' అన్నాడు.

సుబ్బారావు తెల్లపోయి నిల్చున్నాడు అర్థంకాక .... అయ్యాక పకాలున నవ్వాడు. ఆనక దిగులు మొహం పెట్టాడు.

"పాపం...." అన్నాడు. "కాఫీయా" అన్నాడు. ....ఇంకో క్షణం ఆగి 'ఇక్కడా?' అన్నాడు.

'ఔనండి' అన్నాడు రాజు విచారంగా వినయంగా.

"కాస్త ఇసింటా రండి కారుకింద పడతారు. ఇక్కడ మహా దూకుడుగా పోతారు. .... సరిగ్గా రెండేళ్ళ క్రితం నేను అచ్చు ఇలాటి సన్నివేశములోనే పాల్గొన్నాను....బొంబాయిలో లెండి....ఆవాళా మీలాంటి వాడే కాఫీ గురించే బతిమాలాడు. ఎటొచ్చి అతనికి కొంచెం పేరుందిలెండి. పెళ్ళి పెడాకులూ లేవేమో బాగా పొగరుగా వుండేవాడు. అంటే ధైర్యం అనుకోండి. ఓ రోజున నేను స్టుడియో గేటు దగ్గరికి వెళ్లాను; ఇప్పుడు మీరు వెళ్ళబోతునట్టే .... కాని ఆశ్చర్యం! నన్ను ఆరోజున ఏగూర్ఖా ఆపలేదు! పైగా జాయియే జనాబ్....జాయియే. అందర్ జాయియే అని ఆహ్వానించాడు. జనం తండోపతండాలుగా లోపలికి పోతున్నారు. స్టుడియోలో ఔట్‌డోర్ దృశ్యాలు తీసేందుకని అట్టేపెట్టిన ఖాళీస్థలం అంతా నిండి ఉంది.

దొరికిందే ఛాన్సు అని దూసుకుపోయాను నేను.

ఆ మధ్యన ఒక ఆసామి చేతులు కట్టుకు నిల్చున్నాడు. ఎదురుగా ఐదారుగురు పెద్ద మనుషులు చక్కగా ముస్తాబై నిలబడ్డారు. వాళ్ళ ముందర బాగా పెద్దమనిషి ఒకడు ఉన్నాడు. అతనే ఓనరుడట.

ఇవతలగా ఉన్న జనం చాలామందికి సంగతేమిటో తెలీదుకాబోలు. కాని, తెలిసిన వాళ్ళంతా ఊహూ జాలిపడి పోతున్నారు, దేనిమీదో ఎందుకో.

మధ్యన ముద్దాయిలా నిల్చున్న అతను గజగజ వణికి పోతున్నాడు కారక్టర్ యాక్టర్‌లా.

అతను చాలా ఘోరనేరం చేశాడట. నేను కనుక్కున్నానులే.

అతను కొత్తగా పైకొస్తున్న రైటరన్నమాట. రైటరంటే రచయిత.

ఓ పిక్చరుకి డైలాగులు రాస్తున్నాట్ట. ఆ పిక్చరు హీరో చాలా పెద్దవాడు. బోల్డు గొప్పవాడు. అందరికీ భయంలే. అతను ఇంకోళ్ల రాసిన డైలాగులు అనడు. రచయిత రాసినవి ముసాయిదావి అన్నమాట. అవి చూసి సొంతంగా ఇంకో వాక్యం కట్టి దాన్ని డజను ముక్కలుగా విరక్కొట్టి మరీ అంటాడు చక్కగా. అనుభవం, కీర్తి ఉన్న పెద్ద రైటర్లెవరూ అతని 'మాట' కాదనరు.

ఈముద్దాయికి ఆ సంగతి తెలీదుట. తెలీక, ఆహీరో ఇతనిడైలాగు చింపేసి కొత్తది కుడుతూఉంటే, 'అయ్యో దాన్ని చంపకండి సార్!' అని ఏడిచేశాడు.

'హా! తెరీ........నేను ఊరకే చింపుతూఉంటేనే చంపుతున్నానని అరిచావా. ఇప్పుడు నిజంగానే చంపేస్తాను కాసుకో" అని కోప్పడి అంతపనీ చేసేశాడు ఆ హీరో. రైటరు వల్లకాదు అన్నాడు.

"అయితే ఏడూ" అనేసి హీరో ఆపళంగా ఇంటి కెళ్ళిపోయాడు.

ఇంకేముంది? కొంపలు మునిగె.

హీరో అంతవాడి మాటకి రైటరు....ఉత్తిరైటరుగాడు జవాబిస్తాడా .... పుట్టగతులుండాలనే? బతికి బాగుపడాలనే? .... అని అందరూ ఆశ్చర్యపడి చాలా సేపటికి లేచారు. ఈలోగా అన్ని స్టుడియోలకీ ఈ కబురు పాకిపోయింది. ఈలోగానే ఎమర్జెన్సీమీటింగు జరిగిపోయింది. కోపంవచ్చిన హీరోగారి సెకట్టరీ అధ్యక్షత వహించాడు.

ఈ ఫలానా కవిగాడు ఇంత ధైర్యంగా జవాబెలా యిచ్చాడు? వాడు రాసిన కథ, మాటలూ వాడి బాబుగాడి సొత్తనుకున్నాడా? .... అసలు వీడికిన్ని దమ్ము లెక్కడివి? అని చర్చ జరిపారు. అందరూ గంభీరో పన్యసించి పారేశారు. సినిమా రైటరుగా చేరి ఏడాది దాటినా వీడి కింత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, ధైర్యం, తనూ మనిషే, మొగాడే నన్న పిచ్చి నమ్మకం, ఎలా ఉండి పోయాయా అని ఎడతెగకుండా ఆలోచించారు. తెగలేదు .... ఎంతకీ తెలియలేదు వాడిగుట్టు .... మీటింగు వాయిదావేసి, షూటింగ్ కాన్సెల్‌చేసి, స్పెషల్ డిటెక్టివులచేత మూడు అహోరాత్రాలు పరిశోధన జరిపించారు.

వాళ్లు, నీడలా వాడి వెంటపడ్డారు. దురాశలా వాడిలో దూరి కూర్చున్నారు. మూడోనాటికల్లా వాడి గుండె నిబ్బరం గుట్టు కనిపెట్టేశారు. తక్షణం ఇంకో ఎమర్జెన్సీ మీటింగుచేసి ఓ రహస్య తీర్మానం చేశారు. మర్నాడే బహిరంగ విచారణ జరిపారన్న మాట. ఇందాక నే చెప్పినట్టు ఆ రైటరుని మధ్య నించోపెట్టి అంతా చుట్టూరా నిలబడి వాడినేరం జాబితా చదివారు.

తరవాత కిరాయి జడ్జి గంభీరంగా నిల్చుని అతనికి అందరూ కలిసి విధించిన శిక్షను పైకి చదివాడు.

అదేమిటని అడగవే?.... అది వినగానే అందరూ హాహా కారాలు చేశారు. ఆ రైటరు గోల చెప్పనక్కర్లేదు.

"ఆ శిక్షమటుకు వద్దు....అది తప్ప ఇంకేదైనా సరే" అని కాళ్లా వేళ్లాపడి మొరపెట్టుకున్నాడు....

'ఏమిటండి ఆ శిక్ష' అన్నాడు రాజు ఉండబట్టలేక.

సుబ్బారావు బాధగా నవ్వి ఒక నిముషం మౌనం పాటించాడు.

"అదా?....మూడు నెలలపాటు స్టుడియో కాంటీన్‌లో కాఫీ ముప్పూటలా పూటకి కప్పు చొప్పున ఈ ముద్దాయి త్రాగవలెను" అని శిక్షవేశారు. డిటెక్టివ్లు కనిపెట్టిన గుట్టు అదే. ఆ రైటరు ఇంటి దగ్గిర్నించి వేరే కాఫీ తెచ్చుకుంటున్నాట్ట. స్టుడియో కాఫీ చుక్కగూడా ముట్టుకోటం లేదుట....అదే ఈ ధైర్యానికి కారణం .... ఇంకేముంది వారం రోజులు తాగితేచాలు .... నువ్వు ఇక్కడ కాఫీ తాగుతానంటే నాకు ఈగాథ గుర్తుకొచ్చింది. కావాలా బేడ? ఇంద" అన్నాడు సుబ్బారావు.

"అయ్యబాబోయ్ .... వద్దండి" అన్నాడు రాజు.

సుబ్బారావు జాలిగా నవ్వాడు. "అయితే లాభంలేదు బ్రదర్ .... నువ్వు సినిమాలకి పనికిరావు నీధైర్యం, గట్రా దాచుకోవాలంటే" అన్నాడు.